సాక్షి కామారెడ్డి

బుధవారం। 16। ఆగస్టు। 2023



హత్య కేసులో అరెస్ట్

బాన్సువాడలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు.

- 8లో ▸



పోరాటం ఆగదు

ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని కాచాపూర్‌వాసులు పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /22.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మెకానిక్‌ల రక్తదానం



కామారెడ్డి అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం కామారెడ్డి హెవీ, లైట్ వెహికల్స్ మెకానిక్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఇందులో 63 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు, రక్తదాతల సమూహం అధ్యక్షుడు వేదప్రకాశ్, మెకానిక్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బి.రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీధర్, ప్రతినిధులు జి.సాయిరాం, సాయి, సిద్ధిక్, రయీజ్‌ఖాన్, శంకర్, నాగసాయి, బాబీ, కిరణ్, షమీం, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు’

కామారెడ్డి క్రైం: పోలీస్ అధికారులపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా ఓ ప్రకటనలో ఖండించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో రేవంత్‌రెడ్డి పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని పేర్కొన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణలో పాటుపడుతున్న పోలీసులను గుడ్డలు ఊడదీసి కొడతామని వ్యాఖ్యానించడాన్ని తప్పుపట్టారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టానికి, న్యాయ వ్యవస్థకు లోబడి మాత్రమే పనిచేస్తామని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను కించపరడాన్ని మానుకోవాలని హితవు పలికారు.

‘సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి’



కామారెడ్డి టౌన్: ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన కామారెడ్డి ఆర్టీసీ డిపోను సందర్శించారు. కార్యాలయం, బస్టాండ్, గ్యారేజీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయం పెంపు, అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఆయనను డిపో అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇందిర, ట్రాఫిక్ ఇన్‌చార్జి లింగమూర్తి, గ్యారేజ్ ఇన్‌చార్జి వసుంధర తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి



కామారెడ్డి రూరల్: రెగ్యులరైజ్ చేయాలని సమ్మె చేస్తున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ స్కూళ్లలోని పార్ట్ టైం స్వీపర్లు.. మంగళవారం కూడా నిరసనలు కొనసాగించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని గాంధీ గంజ్‌లోగల గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ నూతన బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం, పార్ట్‌టైం స్వీపర్లు బాలయ్య, సిద్ధిరాములు, మునీరొద్దీన్, గంగయ్య, మల్లేశం, సరోజ, భూమయ్య, నారాయణ, అశోక్, శంకర్, శివలింగం, రాములు, ఫాతిమాబీ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో నాలుగో స్థానం

ఖలీల్‌వాడి : ఆయుష్మాన్ భారత్ పథకంలో జాతీయస్థాయిలో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నాలుగో స్థానంలో నిలిచిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తెలిపారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అనస్థీషియా వైద్యుడు కిషన్‌ను సన్మానించారు. సేవలతో జిల్లా స్థాయిలో ప్రశంస పత్రం అందుకున్న ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. ఉత్తమ ఆయుష్మాన్ భారత్ సేవలను అందించినందుకు గాను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉత్తమ పనితీరు అవార్డును సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌కు అందించారు.

సంక్షేమ సర్కార్

- నబ్బండ వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వమిది
- రైతును రాజును చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం
- స్వాతంత్య్ర దినోత్సవాల్లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న స్పీకర్.. ఉత్సవాలను తిలకిస్తున్న జిల్లా ప్రముఖులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్





జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ‘‘తెలంగాణ రాష్ట్రం ఎవరో ఇస్తే వచ్చింది కాదు.. కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్నం. అందుకే రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌కు పట్టంగట్టిండ్రు. సాధించుకున్న రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సబ్బండ వర్ణాలకు మేలు చేస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచాం’’ అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మంగళవారం జరిగిన స్వాతంత్య్ర దిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం పోలీసులనుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ బాగా పనిచేస్తున్నారంటూ కితాబిచ్చారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

- రైతును రాజును చేసే ప్రక్రియ తెలంగాణలో కొనసాగుతోంది. ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయతో చెరువుల పునరుజ్జీవం, 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో సిరుల పంటలు పండుతున్నాయి. ఎరువుల కొరత లేకుండా చేశాం. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తున్నాం. ఛత్తీస్‌గఢ్‌లో ధాన్యం కొనేవారు లేక అక్కడి నుంచి బాన్సువాడకు తెచ్చి క్వింటాలుకు రూ.1200లకు అమ్ముకుంటున్నారు.
- కామారెడ్డి, ఎల్లారెడ్డికి సంబంధించిన కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. దీనికోసం ఇద్దరు ఎమ్మెల్యేలు గోవర్ధన్, సురేందర్‌లు అడుగుతున్నారు. అయితే కొండం చెరువు వద్ద కొంత సమస్య తలెత్తి పనుల్లో ఆలస్యమైంది.
- ఆరోగ్యలక్ష్మి, న్యూట్రిషన్ కిట్స్, కేసీఆర్ కిట్స్ అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే..
- జిల్లాలో రైతుబంధు ద్వారా 11 విడతలలో2,96,452 మంది రైతులకు రూ. 2,500 కోట్ల పెట్టుబడి సాయం అందించాం.
- వివిధ కారణాలతో 5,895 మంది రైతులు చనిపోగా.. వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.294.75 కోట్లు అందించాం.
- ఉద్యానవన శాఖ ద్వారా 484 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది.
- మత్స్యశాఖ ద్వారా మత్స్యకారులకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం. చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి చేపపిల్లలను అందజేస్తున్నాం.
- గొల్లకురుమలకు మొదటి విడతలో రూ.103.84 కోట్లతో 10,795 యూనిట్లను అందించాం. రెండో విడతలో ఇప్పటివరకు 2,890 యూనిట్లను పంపిణీ చేశాం.
- ఆసరా పథకం ద్వారా జిల్లాలో 1,69,231 మందికి ప్రతినెలా రూ.35.98 కోట్ల పింఛన్ అందిస్తున్నాం.
- దళితబంధు పథకం ద్వారా జిల్లాలో మొదటి విడతలో 1,648 యూనిట్లు పంపిణీ చేశాం. రెండో విడతలో ఒక్కో నియోజకవర్గంలో 1,100 మందికి దళితబంధు ఇవ్వడానికి నిధులు మంజూరయ్యాయి. అందుబాటులో ఉన్నచోట దళితులకు భూమి కొనుగోలు చేసి ఇచ్చాం.
- బీసీలు, మైనారిటీలకు రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం.
- జిల్లాలో 37,077 కుటుంబాలకు కల్యాణలక్ష్మి, 6,065 కుటుంబాలకు షాదీ ముబారక్ అందించాం.
- ఎస్టీలు సాగు చేసుకుంటున్న 11,365 ఎకరాల పోడు భూములకు ఇటీవలే పోడు పట్టాలు అందించి ఆదుకున్నాం. వారికి రైతుబంధు కూడా అందజేస్తున్నాం.
- జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశాం. బాన్సువాడలో నర్సింగ్ కాలేజీ ప్రారంభించాం.
- వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆస్పత్రుల్లో ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లాలోని అన్నిచోట్ల వైద్య సేవలు చాలా మెరుగుపడ్డాయి. కిడ్నీ బాధితులకోసం డయాలసిస్ సేవలు అందుబాటులోకి తెచ్చాం. వారికి కూడా పెన్షన్ ఇస్తున్నాం.
- జిల్లాలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. డిగ్రీ కాలేజీలు, జూనియర్ కాలేజీలు మంజూరు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చాం. మద్నూర్‌లో డిగ్రీ కాలేజీ, బీబీపేటలో జూనియర్ కాలేజీలు ఏర్పాటయ్యాయి.
- మన ఊరు–మన బడి కార్య క్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నాం.
- జిల్లాలో లక్షా 9 వేల మంది రైతులు బోర్లకు ఉచిత కరెంటు పొందుతూ మంచి పంటలు పండిస్తున్నారు. విద్యుత్ శాఖ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. అవసరమైన చోట సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం.
- పల్లె, పట్టణ ప్రగతి ద్వారా పల్లెలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం.
- రోడ్లు, భవనాల శాఖ ద్వారా జిల్లాలో రోడ్లను విస్తరించడం, అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయి.
- జిల్లాలో పోలీసు శాఖ పనితీరు చాలా బాగుంది. ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు అధికారులు, సిబ్బంది బాగా పనిచేస్తున్నారు.


ఉత్సవాలలో ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ బి.శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న స్పీకర్

ప్రశంసలు.. రుణాలు..

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకలలో 58 శాఖలలో విశిష్ట సేవలు అందించిన 294 మంది ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందించారు. 286 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ కార్యదర్శులుగా నియామక పత్రాలు ఇచ్చారు. జిల్లాలో పంట రుణాలకు సంబంధించిన రూ. 1,319 కోట్ల చెక్కును, మహిళా సమాఖ్యలకు రూ.36.47 కోట్లు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు రూ.5 కోట్ల చెక్కులను అందజేశారు.





ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన.. బాన్సువాడ ఎస్టీ గురుకుల విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ కవితా తోరన్

సౌత్ క్యాంపస్‌లో హరితహారం

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం హరితహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవితా తోరన్ మాట్లాడుతూ ఏటా ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఐదు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అధ్యాపకులు రాజేశ్వరి, మోహన్‌బాబు, లలిత, అంజయ్య, సబిత తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పంటల సాగు

- 4.95 లక్షల ఎకరాల్లో పంటలు
- వరి సాగే అధికం

నిజాంసాగర్: జిల్లాలో పంటల సాగు ఆశాజనకంగా ఉంది. నెల క్రితం కురిసిన వర్షాలతో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. దీంతో అంచనాలకు అనుగుణంగా పంటలు సాగయ్యాయి. నిజాంసాగర్‌తో పాటు పోచారం, కౌలాస్, కల్యాణి ప్రాజెక్టులు, సింగితం రిజర్వాయర్, చెరువులు, కుంటలు, బోరుబావుల కింద జోరుగా పంటలు వేశారు. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో 4.95 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 2.92 లక్షల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, తాడ్వాయి, గాంధారి, బాన్సువాడ, సదాశివనగర్ తదితర మండలాల్లో 82 వేల ఎకరాల్లో సోయా వేశారు. 59 వేల ఎకరాల్లో మక్క సాగయ్యింది. పత్తి 23 వేల ఎకరాల్లో, కంది 13 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.



నర్వ శివారులో సాగువుతున్న వరి పంట

ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం

వానాకాలం పంటల సాగు దాదాపు పూర్తికావచ్చింది. సర్వే నంబర్ల వారీగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో పంటల నమోదుకు వస్తున్న ఏఈవోలకు రైతులు సహకరించాలి. పంటలను నమోదు చేసుకుంటే ఏ ఇబ్బందులూ ఉండవు.

– భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

‘ప్రధాన సమస్యల ప్రస్తావనే లేదు’



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రధాన సమస్యల గురించి మంత్రి కేటీఆర్ ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించారని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఎల్లారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంచాలని గతంలో పాదయాత్ర చేసిన సురేందర్.. దాని ఎత్తు పెంపు విషయాన్ని మంత్రితో ప్రస్తావించలేదన్నారు. ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు, భూంపల్లి ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది మంత్రి ప్రస్తావించలేదన్నారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసి, దుకాణాలు, పాఠశాలలను మూసి వేసి సభను నిర్వహించడమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, అఫీజ్ పాల్గొన్నారు.

‘విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు’

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో సోమవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బహిరంగ సభ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉషాగౌడ్, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, సతీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

‘ఎల్లారెడ్డి నియోజకవర్గంపై కేటీఆర్‌ది కపట ప్రేమ’



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంపై మంత్రి కేటీఆర్ దొంగ ప్రేమను ప్రదర్శిస్తున్నారని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు విమర్శించారు. మంగళవారం ఎల్లారెడ్డిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా గుర్తుకు రాని ఎల్లారెడ్డి ఎన్నికలు నాలుగు నెలలు ఉన్నాయనగా గుర్తుకువచ్చిందా అని మంత్రిని ప్రశ్నించారు. నాలుగు ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగు నెలల్లో ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతిని ఇంతవరకు అందించలేదన్నారు. నాలుగేళ్ల క్రితం సురేందర్‌కు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు డబ్బులిచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, నారాయణ, అజర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రహరీ నిర్మించండి సారూ..




బాన్సువాడ: బీర్కూర్ మండలం బరంగేడ్గి ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఉన్న పాఠశాల ప్రతి ఏటా ఒక్కో తరగతి పెంచుతూ అప్‌గ్రేడ్ చేస్తున్నారు. సరిపడా తరగతి గదులు లేకపోవడంతో మన ఊరు –మన బడి కార్యక్రమంలో రెండు అదనపు తరగతి గదులను నిర్మించారు. ప్రస్తుతం ఆ గదుల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సాయంత్రం వేళల్లో ఆకతాయిలు వచ్చి మద్యం సేవిస్తున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బస్టాండ్ సమీపంలో ఆరు నెలలుగా మిషన్ భగీరథ పైపు లైన్ పగిలి లీకేజీ అవుతోంది. నీరు కలుషితమవుతున్నాయి. అధికారులు త్వరగా స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రాలు

జిల్లాలో కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన అధికారులకు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, జెడ్పీ చైర్ పర్సన్ దఫేదార్ శోభ అతిథులుగా హాజరై ప్రశంసాపత్రాలు అందజేశారు.

– కామారెడ్డి క్రైం



శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో, కామారెడ్డి



రాజారాం, సీపీవో | సాయాగౌడ్, జెడ్పీ సీఈవో | సాయన్న, డీఆర్‌డీవో | శ్రీనివాస్‌రావు, డీపీవో | రాజు, డీఈవో | దయానంద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | భాగ్యలక్ష్మి, డీఏవో



వాణి, డీటీవో | సతీష్‌యాదవ్, ఏడీ గ్రౌండ్ వాటర్ | కిష్టయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ | షేక్ సలాం, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి | శ్రీనివాస్, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ | సింహారావు, జిల్లా పశువైద్యాధికారి | రమ్య, డీఎంవో | సాయిభుజంగరావు, సూపరింటెండెంట్ | ప్రవీణ్‌కుమార్, కలెక్టర్ సీసీ | సంతోష్, కలెక్టర్ పేషీ డ్రైవర్ | కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్ సీసీ



రాజ్‌కుమార్, హెచ్‌హెచ్‌పీ | విజయలక్ష్మి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి | జగన్నాథరెడ్డి, డీఎస్పీ, బాన్సువాడ | నరేష్, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి | శ్రీధర్‌రెడ్డి, సీఐ, డీసీఆర్‌బీ | కృష్ణారెడ్డి, ఎస్సై, మద్నూర్ | సురేష్, ఏఆర్, కానిస్టేబుల్ | హన్మాండ్లు, కోర్టు లైజనింగ్ అధికారి | సంతోష్, పీసీ, డీసీఆర్‌బీ | విశ్వనాథ్, పీసీ, కామారెడ్డిటౌన్ | రాజేశ్వరి, డబ్ల్యూపీసీ, కలెక్టరేట్



రేణుక, డబ్ల్యూపీసీ, భిక్కనూరు | శ్రీనివాస్, ఏఆర్ కానిస్టేబుల్ | సంతోష్, సీఐ స్పెషల్ బ్రాంచ్ | సాయిరెడ్డి, ట్రెజరీ | వేణుగోపాల్, డీఈవో ఆఫీస్ | గంగాప్రసాద్, జెడ్పీ ఆఫీస్ | రమేశ్, డీపీఆర్‌వో సబార్డినేట్ | రమణ, సీనియర్ అసిస్టెంట్, డీపీవో | సవిత, ఎంపీవో, రామారెడ్డి | ప్రకాష్‌చారి, కానిస్టేబుల్ | అనిత, పంచాయతీ కార్యదర్శి

నిరుద్యోగులు జాబ్‌మేళాను వినియోగించుకోవాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రావు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో జాబ్ మేళా వాల్ పోస్టర్లను పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2న ఎల్లారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, ఐటీఐ, డిగ్రీ చదివిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నాయకులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, అజర్, నారాయణ తదితరులున్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు



కాచాపూర్‌లో నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్తులు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగదని కాచాపూర్ వీడీసీ అధ్యక్షుడు మైపాల్ అన్నారు. మంగళవారం ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థాల నుంచి కాచాపూర్ గ్రామాన్ని పరిరక్షించాలంటూ చేపట్టిన నిరసన దీక్షలు 113వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు మైపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు అనిల్, రాములు, సిద్ధరాములు, బాబు, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి దోమకొండ ఆదర్శంగా ఉండాలి



మాట్లాడుతున్న కామినేని అనిల్‌కుమార్

దోమకొండ: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో రాష్ట్రానికి దోమకొండ ఆదర్శంగా ఉండటానికి గడికోట ట్రస్టు ఆధ్వర్యంలో కార్యక్రమాలు రూపొందిస్తున్నామని గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం దోమకొండ గడికోటలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఐకేపీ సహకారంతో దీని కోసం మహిళా సంఘాన్ని ఎంపిక చేశారని తెలిపారు. కేరళ రాష్ట్రంలోని గ్రామాన్ని దీని కోసం అధ్యయనం చేసి అలాంటి పద్ధతిని ఇక్కడ అవలంబించడానికి కృషి చేస్తున్నామని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ధర్పల్లి జెడ్పీటీసీ జగన్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలు సిద్ధించడానికి బడుగు బలహీన వర్గాల్లో మరింత చైతన్యం రావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్ఆర్ఐ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రెంజర్ల రాజేష్, గజ్జెల అశోక్, సర్పంచ్ దేవాగౌడ్, ఎంపీటీసీ గంగారం, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వైస్ ఎంపీపీ రాజన్న, రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మోహన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీలలో అనంతమైన శక్తి

నందిపేట్: స్త్రీలో అనంతమైన శక్తి ఉంటుందని, దాన్ని సక్రమమైన మార్గంలో ఉపయోగించుకోవాలని బ్రహ్మ కుమారీలు పేర్కొన్నారు. నందిపేటలోని కేదారేశ్వర ఆశ్రమంలో మంగళవారం బ్రహ్మకుమారీస్ స్టేట్ క్యాంపెయిన్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మహిళలు తమకు కలిగే మానసిక ఒత్తిడి, ఆందోళనను పాజిటివ్ థింకింగ్ ద్వారా తగ్గించుకోవచ్చునని దీనికి ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాముల మహారాజును బ్రహ్మకుమారీలు సన్మానించారు.

క్రైం కార్నర్

మంజీరలో దూకి యువకుడి ఆత్మహత్య

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన బీరుగొండ (24)అనే యువకుడు గ్రామ శివారులోని మంజీర నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నదికి సమీపంలోని పొలంలో సోమవారం మధ్యాహ్నం పనిచేస్తున్న బీరుగొండ అకస్మాత్తుగా మంజీర నదిలో దూకి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సాయంత్రం వరకు నదిలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం మళ్లీ గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హిందీ ఉపాధ్యాయుడి మృతి



ఉదయ్ దత్తు (ఫైల్)

భిక్కనూరు : హిందీ ప్రచారక సమితి జిల్లా ప్రతినిధి భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జోషి ఉదయ్ దత్తు (55) మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఆయన ఇటీవల ఉత్తరభారతంలో తీర్థయాత్రకు వెళ్లి అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఆయనను విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజుల క్రితం ఆరోగ్యం కుదుట పడిందని, నాలుగురోజుల్లో డిశ్చార్జి చేస్తామని వైద్యులు చెప్పినప్పటికీ మంగళవారం వేకువజామున అకస్మాత్తుగా మృతిచెందాడు. ఆయన అంత్యక్రియలను స్వస్థలమైన నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు పాఠశాలలో ఉపాధ్యాయులు ఆయను నివాళులు అర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బలోని గుమస్తాకాలనీలో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు ఆధ్వర్యంలో దాడి చేయగా రూ.11,560 తోపాటు ఏడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటాడే వారి వివరాలు 87126 59839కు సమాచారం ఇవ్వాలన్నారు.

హత్య కేసులో ఒకరి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడలో జరిగిన హత్య కేసులో న్యాయవాది ఉబేద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ పోలీస్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని అర్ఫత్ కాలనీకి చెందిన షేక్ అహ్మద్(45) అనే వ్యక్తి తన ఇంటిపై రెండో అంతస్తు కట్టేందుకు సాజిద్ అనే కాంట్రాక్టర్‌కు రూ. 18 లక్షలకు మాట్లాడి రూ.17 లక్షలు ఇచ్చాడు. కానీ సాజిద్ పనిచేయకపోవడంతో అతడిపై కేసు పెట్టేందుకు ఉబేద్ అనే లాయర్‌ను ఈనెల 12న అహ్మద్ కలిశాడు. ఫీజు విషయంలో ఉబేద్‌కు, షేక్ అహ్మద్‌కు మధ్య గొడవ జరగగా అహ్మద్‌ను లాయర్ ఉబేద్ కర్ర, బండరాయితో కొట్టడంతో గాయాలు కాగా తీవ్ర గాయాలయ్యాయి. మొదట బాన్సువాడ ఆస్పత్రికి అనంతరం నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అహ్మద్ మరణించాడు. అహ్మద్ సోదరుడు మహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఉబేద్‌ను పట్టుకుని 14న రిమాండ్ చేశామన్నారు. నిందితుడిని పట్టుకున్న సీఐ మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, స్వామి, గంగాధర్, అశోక్‌లను డీఎస్పీ అభినందించారు.

అండర్ వే బ్రిడ్జి కోసం విన్నపాలు

- జాతీయ రహదారి 44పై అండర్ వే బ్రిడ్జ్ నిర్మించాలని డిమాండ్
- రోడ్డు క్రాస్ చేస్తూ ఏటా ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- తాజాగా రెండు రోజుల క్రితం యువకుడి మృతి



ముప్కాల్ మండల కేంద్రంలో బైపాస్ వద్ద అండర్ వే బ్రిడ్జి కోసం డిమాండ్ చేస్తున్న జంక్షన్ ఇదే..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో జాతీయ రహదారి 44 బైపాస్ వద్ద గల జంక్షన్ వద్ద అండర్ వే బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ఏళ్ల తరబడి నుంచి డిమాండ్ చేస్తున్నారు. 2007లో రహదారి వెడల్పు చేపట్టడంతో పాత జాతీయ రహదారి గుండా రోడ్డును వెడల్పు చేపడితే ఇళ్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో గ్రామం పక్క నుంచి జాతీయ రహదారిని నిర్మించారు. బైపాస్ క్రాస్ చేస్తూ పంట భూములతో పాటు, మెండోరా మండల కేంద్రం రోడ్డుకు వెళ్లాలి. మెండోరా రోడ్డు గుండా పెద్ద వాగు రోడ్డుకు ప్రయాణం చేపట్టవచ్చు. దీంతో దూర భారం తగ్గుతుంది. అనేక గ్రామల ప్రజలు బైపాస్ క్రాస్ చేస్తూ ప్రయాణం సాగిస్తారు. దీంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. తాజాగా గత ఆదివారం ఓ యువకుడు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మండల కేంద్రవాసులు పంట భూములకు వెళ్లేప్పుడు ప్రమదాల బారిన పడుతున్నారు. పశువులు ప్రమాదాలకు గురవుతూ మత్యువాత పడుతున్నాయి. దీంతో అండర్ వే బ్రిడ్జ్ నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అండర్‌వే బ్రిడ్జ్ కావాలని ఢిల్లీ వరకు వీడీసీ ఆధ్వర్యంలో సభ్యులు వెళ్లారు. కాని ఇప్పటి వరకు నిర్మాణానికి మోక్షం లభించ లేదు.

నిబంధనలు అడ్డు..

జాతీయ రహదారిపై రెండు అండర్ వే బ్రిడ్జ్‌లకు మధ్య 4 కి.మీ దూరం ఉండాలని జాతీయ రహదారి అధికారులు తెలుపుతున్నారు. మండలంలోని కొత్తపల్లి శివారులో ఒక అండర్ వే బ్రిడ్జ్ ఉంది. ఆ బ్రిడ్జ్ నుంచి ప్రస్తుతం నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్న జంక్షన్ వరకు సుమారు 2 కి.మీ మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. దీంతో నిబంధనలు అడ్డు వస్తున్నాయని నేషనల్ హైవే అధికారులు చేతులెత్తేస్తున్నారు. నేషనల్ హైవే అధికారులు తప్పుడు నివేదిక ఇవ్వడం వల్లే బ్రిడ్జ్ మంజూరు కావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు పక్కన ఉంటే నిబంధనలను సవరించి అండర్ వే బ్రిడ్జ్ నిర్మించవచ్చని నేషనల్ హైవే అధికారులు తెలుపుతున్నారు. కాని అక్కడ అలాంటివి లేకపోవడంతో బ్రిడ్జ్ మంజూరు కావడం లేదు. కాని ప్రమాదాలు ఆగడం లే దు.

ప్రాణాలు పోతున్నాయి..



జాతీయ రహదారి జంక్షన్ వద్ద వెంటనే అండర్ వే బ్రిడ్జిని నిర్మించాలి. లేదంటే ఏటా అనేక మంది ప్రాణాలు పోతున్నాయి. గతంలో చాలాసార్లు హైవే అధికారులకు చెప్పాం. కాని ఇప్పటివరకు నిర్మించలేదు. నిబంధనల పేరుతో కాలం వెళ్ల దీస్తున్నారు.

– ముస్కు నర్సయ్య, గ్రామస్తుడు

డ్రైడే రోజు.. మద్యం అమ్మకాల జోరు

- బెల్ట్‌షాపుల ద్వారా మద్యాన్ని విక్రయించిన వైన్ షాప్‌ల యజమానులు
- బెల్ట్ షాపులు వారి చేతుల్లోనే ఉండడంతో ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- ఎక్సైజ్ శాఖ నిఘా వైఫల్యమే కారణం

మోర్తాడ్(బాల్కొండ): స్వాతంత్ర దినోత్సవం రోజున మద్యం అమ్మకాలను నిషేధించడమే కాకుండా డ్రైడేగా పాటించాలనే నిబంధన ఉన్నా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాల యజమానులే బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. అధికారికంగా వైన్స్‌లను మూసి ఉంచినా బెల్ట్‌షాపుల ద్వారా మద్యం దందా మాత్రం కొనసాగింది. బెల్ట్‌షాపులకు ఒకరోజు ముందుగానే మద్యంను తరలించి మంగళవారం రోజున యథేచ్ఛగా విక్రయించారు. మోర్తాడ్, ఏర్గట, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లోని అన్ని బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలకు అడ్డు అదుపులేకుండా సాగింది. ఎక్సైజ్‌శాఖ నిఘా లోపంతో మద్యం ఏరులై పారినా పట్టించుకునేవారు కరువయ్యారు. వైన్ దుకాణాల యజమానుల చేతుల్లోనే బెల్ట్‌షాపులు ఉండటంతో డ్రైడే అనే తేడా లేకుండా మద్యం అమ్మకాలు కొనసాగాయి. బీరు, విస్కీ సీసాలపై రూ.5 నుంచి రూ.10వరకు ధర పెంచి విక్రయించడం గమనార్హం. మద్యం అమ్మకాలు జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాధిత సర్పంచ్‌కు పరామర్శ



ఖలీల్‌వాడి: సస్పెన్షన్‌కు గురై ఆత్మహత్యాయత్నం చేసిన కల్లెడ సర్పంచ్ లావణ్య ఈ పరిస్థితి రావడానికి స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులే బాధ్యులని విపక్ష నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జీజీహెచ్‌లో లావణ్యను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా విపక్ష నాయకులు ప్రభా కర్, దేవరాం, కాంగ్రెస్ నేత పోల వెంకటేష్, టీడీపీ నేత దేగాం యాదాగౌడ్ మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అప్పులు చేసి పనులు చేసిన నిధులు రాకపోవడంతో చావు బతుకుల్లో లావణ్య ఉందన్నారు. అభివృద్ధి చేయించిన పనులకు బిల్లులు రాక, ప్రశ్నించినందుకు స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డి వారిపై పగబట్టి ఇబ్బందుల పాల్జేయడం సరికాదన్నారు. లావణ్యకు న్యాయం చేయాలని వారి డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విపక్ష నాయకులు అంబిక సత్యనారాయణ, లవంగ రాజు, ఫిరోజ్, రవి పాటిల్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌ను ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



జక్కుల గంగారాం(ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం సైకిల్‌పై వెళ్తున్న జక్కుల గంగారాం (35) అనే వ్యక్తిని బైక్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గంగారం సైకిల్‌పై కామప్ప చౌరస్తా వద్దకు వెళ్తుండా బీర్కూర్ గ్రామానికి చెందిన సమద్ అలియాస్ షారుఖ్, సుమెర్‌లు బైక్‌పై అతి వేగంతో బాన్సువాడ వైపు వెళ్తూ సైకిల్‌ను ఢీకొన్నారు. బైక్ వేగంతో ఉండడంతో సైకిల్‌పై ఉన్న గంగారం రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫారుఖ్, సుమేర్‌కు తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రులను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఫారూఖ్‌కు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు.